
ఆంధ్రజ్యోతి





గిరిజన సంప్రదాయ నృత్యం చేస్తున్న కళాకారులు



'ఆదోనిలో నేను ఎమ్మెల్యేగా గెలిచినా ఇక్కడ నాయుడన్ననే ఎమ్మెల్యే. అన్న మూడుసార్లు ఎమ్మెల్యేగా చేశారు. ఆయన చెప్పిన పనులన్నీ జరుగుతాయి. నేను జాతీయ రాజకీయాల్లో కీలకంగా ఉండడం వల్ల ఆదోనిలో ఎక్కువ సమయం కేటాయించలేను. నాయుడన్న 90 శాతం చూసుకుంటే, నేను పది శాతమే చూసుకుంటాను. ఇందులో ఎలాంటి సందేహం లేదు.'

- ఎన్నికల ముందు టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు ఇంట్లో బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ పార్థసారథి అన్న మాటలివి.

'ఎప్పుడూ కమ్మ.. కాపు(రెడ్డి)లే ఇక్కడ ఎమ్మెల్యేలుగా ఉండాలా..? నేను లేదంటే సాయిప్రసాద్‌రెడ్డినే ఉండాలా..? ఇన్నాళ్లకు టీడీపీ కూటమి బోయల (వాల్మీకులు)కు టికెట్ ఇచ్చింది. మీలో ఐక్యత లేదా..? బీసీలంతా ఏకమై బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథిని గెలిపించాలి.'

- ఎన్నికల ప్రచారంలో టీడీపీ కూటమి అభ్యర్థి గెలుపు కోసం టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు వ్యాఖ్యలు.

కూటమిలో కుమ్ములాట..!

ఆదోని నియోజకవర్గం కూటమిలో గందరగోళం నెలకొంది. కూటమిలో కుమ్ములాటలతో సగటు కార్యకర్త మనోవేదనకు గురవుతున్నాడు. ఓ వైపు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి.. మరో వైపు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు మధ్య ఆధిపత్య పోరు ఇరుపార్టీల అధిష్ఠానానికి తలపోటుగా మారింది. పాలన, అభివృద్ధిని గాలికొదిలేసి ఒకరిపై ఒకరు మాటల తూటాలను పేల్చుతున్నారు. బహిరంగంగానే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కూటమి మిత్రబంధానికి గండికొడుతున్నారు. ఈ క్రమంలో ఇరునేతల మధ్య పొలిటికల్ పోరు కాస్తా రాజధాని అమరావతికి చేరింది. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న సీఎం చంద్రబాబు కూటమి నేతల మధ్య సయోధ్య కుదిర్చే బాధ్యతను రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌కు అప్పగించారు.

- మూడు నెలల ముచ్చటగా మిత్రబంధం
- కూటమి ధర్మం పాటించని ఎమ్మెల్యే పార్థసారథి : టీడీపీ
- టీడీపీ అంటే మీనాక్షినాయుడు ఒక్కడే కాదు : బీజేపీ
- వర్గవిభేదాలతో 'పార్థుడి' రాజకీయం
- ఆదోనిలో టీడీపీ, బీజేపీ మధ్య వార్
- సీఎం చంద్రబాబుకు ఒకరిపై ఒకరు ఫిర్యాదు
- సయోధ్య బాధ్యత మంత్రి భరత్‌కు
- యువనేత లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

కర్నూలు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల క్రితం ఎన్నికల వేళ పార్థసారథి మాటలను టీడీపీ కార్యకర్తలు ముఖ్యంగా మీనాక్షినాయుడు వర్గీయులు విశ్వసించారు. మీనాక్షినాయుడు ప్రసంగం బీసీల్లో చైతన్యం తీసుకొచ్చింది. అదే క్రమంలో జగన్ పాలనపైన.. స్థానికంగా ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఆయన కుమారుడు, వర్గీయుల తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆదోని నియోజకవర్గం ఓటర్లు టీడీపీ కూటమి అభ్యర్థి పార్థసారథి 18,164 ఓట్ల ఆధిక్యతతో గెలిపించారు. టీడీపీ, బీజేపీ, జనసేనా నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషి ఫలితమే ఈ విజయం అంటూ సంబరాలు చేసుకున్నారు. కూటమి విజయోత్సవ ఆనందం మూడు నెలల ముచ్చటగా మారింది. తాజాగా టీడీపీ, బీజేపీ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం కూటమిలో కుమ్ములాటను బహిర్గతం చేస్తోంది. 'గత ఐదేళ్ల ప్రతిపక్షంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాం.. టీడీపీ బలోపేతం కోసం తీవ్రంగా నష్టపోయాం.. ఇప్పుడు కూటమి అభ్యర్థిని గెలిపించుకున్నా మమ్మల్ని దూరం పెట్టడం ఎంతవరకు సబబు' అని తెలుగుతమ్ముళ్లు రగిలిపోతున్నారు. ఈ నెల 1న పత్తికొండకు వచ్చిన సీఎం చంద్రబాబుకు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేశారు. వీరిద్దరి మధ్య సమన్వయం చేసే బాధ్యత మంత్రి టీజీ భరత్‌కు అప్పగించారు.

టీడీపీలో విభేదాలే 'పార్థుడి' అస్త్రాలు?

ఆదోని టీడీపీలో ఎన్నికల ముందు వరకు ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు మదిరె భాస్కరరెడ్డి, పెద్దహరివాణం దేవేంద్రప్ప, టీడీపీ రాష్ట్ర నాయకురాలు గుడిసె కృష్ణమ్మ, ఎల్లెల్సీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్సాపురం రామస్వామి ఈ ఐదుగురు టీడీపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. వీరిలో దేవేంద్రప్ప, రామస్వామిలు మీనాక్షినాయుడుతో కలిసిపోయారు. టీడీపీలో వర్గవిభేదాలను తనకు అనుకూలంగా మార్చుకొని ఎమ్మెల్యే పార్థసారథి వ్యూహాత్మకంగా రాజకీయ క్రీడ ఆడుతున్నారనే టీడీపీ వర్గీయులు పేర్కొంటున్నారు. 'నా గెలుపు కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు కష్టపడ్డారే తప్పా మీనాక్షినాయుడు ఏమాత్రం కష్టపడలేదు..' అని అంటున్నారు ఎమ్మెల్యే పార్థసారథి. ఇదే క్రమంలో టీడీపీ నాయకులు భాస్కరరెడ్డి, గుడిసె కృష్ణమ్మలను చేరదీసి.. నాయుడు వర్గాన్ని దూరం పెట్టడమే కాకుండా కనీస ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఆయన వర్గీయులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. నెల రోజుల క్రితం బీజేపీ సీనియర్ నాయకుడు విట్టా రమేశ్ ఇంట్లో ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప సహా ఆయా పార్టీ ముఖ్య నాయకులు సమావేశమై ప్రభుత్వ పనులు, సివిల్‌సప్లైస్ డీలర్లు, మధ్యాహ్న భోజనం నిర్వహణ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిసెంట్లు వంటి వాటిలో టీడీపీకి 65 శాతం, బీజేపీ, జనసేనకు 35 శాతం ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. అనంతరం ఈ ఒప్పందం కూడా మూణ్ణాళ్ల ముచ్చటగానే మారింది.

లోకేశ్‌ను కలిసిన నేతలు

ఈ నెల 1న పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామానికి వచ్చిన సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఇద్దరు కూడా హెలిప్యాడ్ వద్ద కలిశారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. వీరిద్దరి మధ్య సయోధ్య కుదర్చే బాధ్యతను జిల్లాకు చెందిన మంత్రి టీజీ భరత్‌కు అప్పగించారు. అయితే.. శుక్రవారం ఇద్దరు కూడా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. ఇద్దరితో వేరువేరుగా మాట్లాడిన యువనేత లోకేశ్ భరోసా ఇచ్చినట్లు సమాచారం.

ఆదోని అభివృద్ధిపై మాట్లాడాను



ఆదోని నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధిపై మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాను. వలసల వల్ల విద్యార్థులు చదువులు ఆగిపోకుండా రెసిడెన్షియల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ బాలికల రెసిడెన్షియల్, ఏపీ మోడల్, జోతిరావు పూలే పాఠశాలలను ఏర్పాటు చేయాలని విన్నవించాను. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం, మాదాసి కురవలకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ అంశాలపై మాట్లాడాను. అదే క్రమంలో ఆదోని తాజా రాజకీయాలపై కూడా చర్చించడం జరిగింది.

- డాక్టర్ పార్థసారథి, ఆదోని ఎమ్మెల్యే

వ్యూహాత్మకంగానే పక్కన పెట్టారా..?

ఆదోనిలో టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షి నాయుడు 1989 నుంచి 2019 వరకు ఏడుసార్లు ఎన్నికలు జరిగితే.. ఆరు పర్యాయాలు పోటీ చేసి మూడు సార్లు గెలిచారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉండడంతో పట్టణ, గ్రామాల్లో బలమైన వర్గం ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల టీడీపీ ఇన్‌చార్జిగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు బాదుడే.. బాదుడు సభలు, యువనేత లోకేశ్ పాదయాత్ర దిగ్విజయం చేశారు. మీనాక్షినాయుడు టీడీపీకి రాష్ట్రంలోనే జోష్ తీసుకొచ్చారంటూ మహానాడు వేదికపైనే అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ సీట్ల సర్దుబాటులో భాగంగా ఆదోని బీజేపీకి ఇవ్వడం.. ఆ పార్టీ కూటమి అభ్యర్థిగా స్థానికేతరుడు డాక్టర్ పార్థసారథిని బరిలోకి దింపింది. మీనాక్షినాయుడు, జనసేన ఇన్‌చార్జి మల్లప్పతో కలసి పార్థసారథి ఎన్నికల ప్రచారం చేశారు. పోలింగ్ రోజు వరకు కూడా తన ఓటమి కోసం మీనాక్షినాయుడు, ఆయన కుటుంబం ప్రయత్నాలు చేస్తోందని ఒక్క మాట కూడా అనలేదు. పట్టణం, గ్రామాల్లో మీనాక్షినాయుడుకు ఉన్న అనుచరబలం చూసిన ఎమ్మెల్యే పార్థసారథి ఆయనకు ప్రాధాన్యత ఇస్తే తన ప్రాధాన్యత తగ్గిపోతుందనే రాజకీయ వ్యూహంలో భాగంగానే నా ఓటమి కోసం ప్రయత్నాలు చేశారంటూ ముద్ర వేసి దూరం పెట్టారనే టీడీపీ వర్గీయులు అంటున్నారు. నిజంగా ఆయన వద్ద ఆధారాలు ఉంటే బయట పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు



ఆదోనిలో టీడీపీ కూటమి అభ్యర్థిగా గెలిచిన బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వ్యూహాత్మకంగానే టీడీపీని దెబ్బతీస్తూ మాకు ప్రాధాన్యత లేకుండా చేస్తున్నారు. ఐదేళ్ల ప్రతిపక్షంలో నాటి వైసీపీ నాయకుల వేధింపులు ఎదుర్కొని పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. ఇవే విషయాలు యువనేత నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాను. అన్నీ నాకు తెలుసు.. మన కార్యకర్తల బలమేంటో నేను పాదయాత్రలో చూశాను. 15 రోజుల్లోగా అన్ని సర్దుబాటు చేస్తాం. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

- కె.మీనాక్షి నాయుడు, మాజీ ఎమ్మెల్యే

మయూర వాహనంపై ఆదిదంపతులు

బ్రహ్మచారిణిగా దర్శనమిచ్చిన భ్రమరాంబికాదేవి ● శ్రీశైలంలో రెండో రోజు దసరా ఉత్సవాలు

శ్రీశైలం, అక్టోబరు 4: శ్రీశైలం మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం భ్రమరాంబికా అమ్మవారు బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా సాయంత్రం మయూర వాహనంపై మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి విహరించారు. నవదుర్గా అలంకారాల్లో ఒకటైన బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కుడిచేతిలో జపమాల, ఎడమచేతిలో కమండలాన్ని ధరించిన అమ్మవారిని దర్శించుకోవడం వల్ల శుభఫలితాలు, విజయాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. గ్రామోత్సవంలో భాగంగా మయూరవాహనంపై స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులనుజేసి సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. అశేష భక్తజనం నడుమ కోలాహలంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు, ఆలయ అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

● దసరా మహోత్సవాల్లో మూడో రోజు శనివారం భ్రమరాంబికా అమ్మవారు చంద్రఘంట అలంకారణలో దర్శనమిస్తారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు రావణవాహనసేవ నిర్వహిస్తారు.



బ్రహ్మచారిణి అలంకారంలో భ్రమరాంబికా అమ్మవారు



శ్రీగిరి వీధుల్లో మయూర వాహనంపై విహరిస్తున్న మల్లికార్జునస్వామి, భ్రమరాంబికా దేవి



వేషధారణలో కళాకారులు

జీడీపీకి జలకళ



15 రోజులుగా ఎల్లెల్సీ నీరు మళ్లింపు

గోనెగండ్ల, అక్టోబరు 4: నాలుగు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో గాజులదిన్నె ప్రాజెక్టు నీటితో కళకళలాడుతోంది. వరద భారీగా వస్తుండటంతో నీటి మట్టం రోజురోజుకూ పెరుగుతోంది. శుక్రవారం జీడీపీలో 375.10 మీటర్ల స్థాయి వరకు నీరు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 2 టీఎంసీల మేర నీటి నిల్వ ఉంది. అయితే ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 4.5 టీఎంసీలని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన దేవనకొండ, ఆస్పరి, పత్తికొండ, మద్దికెర, తుగ్గలి ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ఎల్లెల్సీ నుంచి 15 రోజులుగా రోజుకు 40 క్యూసెక్కుల చొప్పున నీటిని జీడీపీకి విడుదల చేస్తున్నారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు



కర్నూలు(రూరల్) అక్టోబరు 4: దసరా పర్వదినం పురస్కరించుకుని ఆయా ప్రాంతాల నుంచి సొంతూర్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు కర్నూలు జిల్లా ప్రజా రవాణా అధికారి టి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 164 ప్రత్యేక బస్సులను,షెడ్యూలు బస్సులకు అదనంగా నడపనున్నట్లు ఆయన వివరించారు. ప్రధానంగా ఈనెల 8నుంచి 11వతేదీ వరకు హైదరాబాదు, విజయవాడ, బెంగళూరు, తిరుపతి, చెన్నై, వంటి దూరప్రాంతాల నుంచి కర్నూలుకు వచ్చే ప్రయాణికుల కోసం 81 బస్సులను ఏర్పాటు చేసినట్లు శ్రీనివాసులు తెలిపారు. అలాగే ఈనెల 13నుంచి 16వతేదీ వరకు తిరుగు ప్రయాణికుల కోసం 83 బస్సులను నడుపుతామని తెలిపారు. ఈ సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. పదిశాతం రాయితీ కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలు మాత్రమే వసూలు చేస్తారన్నారు.

కాంట్రాక్టర్లను బెదిరించడం సరికాదు

● అధికారం కోల్పోయినా వైసీపీకి బుద్ధి రాలేదు ● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), అక్టోబరు 4: వైసీపీ శ్రేణులు మామూళ్ల కోసం కాంట్రాక్టర్లను బెదిరించడం సరికాదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విండ్ కంపెనీ ప్రతినిధులపై బెదిరింపులు, దౌర్జనాలకు పాల్పడడం, కార్యాలయంపై దాడులకు పాల్పడి ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడం దుర్మార్గమని అని అన్నారు. వైసీపీ అధికారం కోల్పోయినా ఆ పార్టీ నాయకులు ఇంకా బుద్ధి రాలేదని మండిపడ్డారు. ఆస్పరి మండలం జోహరాపురం, దేవనకొండ మండలం జిల్లేలబుడగ గ్రామాల్లోని కార్యాలయాల్లో సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేశారని అన్నారు. జగన్ చూపిన రౌడీయిజం, గూండాయిజం, అక్రమ మార్గాలను వైసీపీ కింది స్థాయి నాయకులు అనుసరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి దుశ్చర్యలను వెంటనే మానుకోవాలన్నారు. ఈనెల 12 నుంచి రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ విధానం అమల్లోకి వస్తుందని తెలిపారు. నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకు అందించేలా పాలసీని రూపొందించారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆకెపోగు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

అధికారులకు సన్మానం



అధికారులను సన్మానించిన కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 4: సేవా తత్పరత, మానవతా దృక్పథంతో అవసరంలో ఉన్న వారికి పింఛన్లు పంపిణీ చేసిన 15 మంది అధికారులను శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ పి.రంజిత్ బాషా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని, అధికారులందరి కృషి, సహకారం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీలో ప్రథమ స్థానంలో చేరేలా కృషి చేసిన డీఆర్‌డీఏ పీడీ సలీంబాషాను సత్కరించారు. ఈసమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), అక్టోబరు 4: జిల్లా పరిశ్రమల కేంద్రంలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ప్రధాన స్థానాలు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం ఆ స్థానాల్లో నూతన అధికారులు కొలువుదీరారు. జనరల్ మేనేజర్‌గా నెల్లూరు నుంచి కేపీ సుధాకర్ బదిలీ కాగా, శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఐపీవోగా శివప్రసాద్ స్థానంలో నంద్యాల నుంచి వచ్చిన డానియేలు విధుల్లో చేరారు.

కాలుష్య నియంత్రణ మండలిలో: జిల్లా కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీరుగా కిషోర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న మునిప్రసాద్ అనంతపురం వెళ్లగా, అనంతపురం నుంచి కిషో ర్‌రెడ్డి కర్నూలుకు వచ్చారు.

కర్నూలు ఎంపీడీవోగా జి.రఘునాథ్

కర్నూలు(రూరల్), అక్టోబరు 4: కర్నూలు మండల ఎంపీడీవోగా జి.రఘునాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నరసింహనాయుడు అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లాలో ఎంపీడీవోగా పనిచేస్తున్న రఘునాథ్‌ను కర్నూలుకు బదిలీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా రఘునాథ్ కర్నూ లుకు వచ్చారు. ఇదివరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న ఈవోఆర్డీ అనూ రాధ నుంచి ఆయన చార్జ్ తీసుకున్నారు.

గూడూరు ఎంపీడీవోగా శివనాగప్రసాద్

గూడూరు: గూడూరు ఎంపీడీవోగా శివనాగ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం గూడూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో విజయ సింహారెడ్డి నుంచి ఎంపీడీవోగా శివనాగ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఓర్వకల్లు ఎంపీడీవోగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. అలాగే పంచాయతీరాజ్ ఏఈగా బి.నాగ రాజు బాధ్యతలు స్వీకరించారు.

సి.బెళగల్ ఎంపీడీవోగా రాణెమ్మ

సి.బెళగల్: సి.బెళగల్ ఎంపీడీవోగా రాణెమ్మ బాధ్యతలు స్వీకరించారు. అస్పరి మండలంలో పనిచేస్తున్న ఎంపీడీవో రాణెమ్మ సిబెళగల్‌కు బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కర్నూలు, అక్టోబరు 4: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రాజీవ్‌గృహకల్పలో సురేష్ (28) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సి.బెళగల్ మండలం ఈర్లదిన్నె గ్రామానికి చెందిన సురేష్‌కు కోడుమూరు మండలం పులకుర్తికి చెందిన సుజాతతో తొమ్మిదేళ్ల కింద వివాహమైంది. వీరి మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. గత రెండేళ్ల నుంచి సురేష్ రాజీవ్ గృహకల్పలో ఉంటూ వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీ రాత్రి తల్లిదండ్రులకు ఫోన్ చేసి తనను బాబు, బాబు కొడుకు బన్ని కొట్టారని చెప్పాడు. ఆ తర్వాత మరుసటి రోజు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తల్లి రంగమ్మ బన్ని అనే వ్యక్తికి ఫోన్ చేసి సురేష్ గురించి ఆరా తీయగా.. సురేష్ రూములో పడుకుని ఉన్నాడని చెప్పాడు. దీంతో అనుమానం వచ్చిన వీరు బన్నిని ఫోన్‌లో గట్టిగా నిలదీయగా.. సురేష్ ఉరి వేసుకుని రూములో ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పాడు. దీంతో హుటాహుటిన వారు కర్నూలు వచ్చి సురేష్ ను ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సురేష్ మృతికి బాబు, ఆయన కొడుకు బన్ని, కోడలు సుజాత, ఆమె తండ్రి అయ్యన్న, ఇమ్మానుయేలు కారణమని తల్లి రంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

కర్నూలు, అక్టోబరు 4: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ముజఫర్‌నగర్‌కు చెందిన మట్కా నిర్వాహకుడు వెంకటరమణారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఈయన వద్ద నుంచి రూ.41,700 నగదుతో పాటు మట్కా చీటీలు, 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అర్చకుల వేతనాల పెంపుపై హర్షం

కర్నూలు(న్యూసిటీ) అక్టోబరు 4: అర్చకుల వేతనాల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్చకులకు ధూప దీప నైవేద్యం పథకం కింద ఇచ్చే గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి సమాఖ్య తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు.

కర్నూలు(కల్చరల్): రాష్ట్రంలో చిన్న చిన్న ఆలయాలకు గత ప్రభుత్వం నెలనెలా ఇస్తున్న రూ.5వేల మొత్తాన్ని సీఎం చంద్రబాబు రూ.10 వేలకు పెంపుదల చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం అభినందనీయమని ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కల్లే చంద్రశేఖర్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూ దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ చేస్తున్న కృషిని అర్చకులంతా స్వాగ తిస్తున్నారని, భవిషత్తులోనూ ఆలయాల పురోగతికి వారు చేయూత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు



కర్నూలులో వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న అమ్మవారు

కర్నూలు(కల్చరల్), అక్టోబరు 4: దేవీ నవరాత్రి ఉత్సవాలు కర్నూలు నగరంలో వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం అమ్మవారి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాల సమర్పణతోపాటు విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక మించిన్ బజార్‌లోని పెద్ద అమ్మవారిశాలలో సాయంత్రం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, పూలబజార్ సమీపంలోగల చిన్న అమ్మవారిశాలలో ధనలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూల విగ్రహంతోపాటూ గర్భగుడిని కొత్త కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. వన్‌టౌన్‌లోని నిమిషాంబ, కాళికాంబ ఆలయాల్లో గాయత్రి మాతగా దర్శనమిచ్చారు. పాతనగరంలోని గీతామందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారికి నందివిద్య నటేశ్వరి దేవి అలంకరణ చేశారు. నగర శివారు గోదా గోకుల క్షేత్రంలో శరన్నవరాత్రి వేడుకలు రెండోరోజు శుక్రవారం అమ్మవారికి ధాన్యలక్ష్మి అలంకరణ చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చనలు, విశేష హారతులు, శ్రీసూక్త హోమం నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన, ఊంజల సేవ చేపట్టారు. బండిమెట్టలోని గంగాభవానీ సమేత కేదారేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి గాయత్రీదేవి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

కల్లూరు: దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మహాగౌరీ అమ్మవారు మహాలక్ష్మీదేవిగా (ధనలక్ష్మీదేవి) భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం గుత్తిపెట్రోల్ బంక్ సమీపంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో అర్చకులు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి, ట్రస్టీ టి.శివరామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

గూడూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజూ సుంకులాపరమేశ్వరిదేవి గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం మండలంలోని కె నాగలాపురం గ్రామంలో అమ్మవారి ఆలయంలో హోమం నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కేశవ, గ్రామ పెద్దలు గోపాల్ రెడ్డి, సురేష్, భక్తులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలకు శుక్రవా రం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని హుశేనాపురం గ్రామంలో అమ్మవారికి భక్తులు కాయకర్పూరాలు సమర్పించారు. అదేవిధంగా మండలంలోని ఓర్వకల్లు, శకునాల, బ్రాహ్మణపల్లె, నన్నూరు తదితర గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



కెనాగలాపురంలో గాయత్రీదేవిగా అమ్మవారు, సూర్యనారాయణ స్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా.. హుసేనాపురంలో దుర్గాదేవిగా..

'టైం స్కేల్ వర్తింపజేయాలి'



ఆర్‌యూ వీసీ చాంబర్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కర్నూలు(అర్బన్), అక్టోబరు 4: కాంట్రాక్ట్ నాన్ టీచింగ్ సిబ్బందికి టైం స్కేల్ వర్తింపజేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలో ఉపకులపతి చాంబర్ ఎదుట కాంట్రాక్టు నాన్ టీచింగ్ ఉద్యోగులు కృష్ణవేణి, కిరణ్మయి, ఎలిషా, రాణి, బాలు ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న తమకు టైం స్కేల్ వర్తింప చేయకుండా వివక్ష చూపుతున్నారని అన్నారు. తమకు మిగతా ఉద్యోగుల మాదిరిగా సమానంగా జీతభత్యాలు పెంచాలని విన్నవించుకున్నా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని వాపోయారు. బోధనేతర సిబ్బంది టైం స్కేల్ చేయాలని, జీత భత్యాలు పెంచాలని డిమాండ్ చేశారు. వారికి మద్దతుగా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్షుడు నాగరాజు, అంబేడ్కర్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుకృష్ణ, టీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌరు దంపతులకు సన్మానం



గౌరు దంపతులను సన్మానిస్తున్న కల్లూరు ఎంపీడీవో

కల్లూరు, అక్టోబరు 4: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి దంపతులను కల్లూరు ఎంపీడీవో జి.నాగేశాచలరెడ్డి సన్మానించారు. నంద్యాల జిల్లా మిడ్తూరు నుంచి కల్లూరు మండలానికి బదిలీపై వచ్చిన ఆయన మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే దంపతులను కలిసి పూలబొకే అందించి శాలువా కప్పి సన్మానించారు. కల్లూరు మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే సూచించారు. గౌరు దంపతులను కలిసిన వారిలో కల్లూరు మండల ఈఓఆర్డీగా బదిలీపై వచ్చిన జి.నగేష్, ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

'చింతామణి నాటకంపై నిషేధం ఎత్తివేయాలి'



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న హనుమంతరావు చౌదరి, తదితరులు

కర్నూలు(కల్చరల్), అక్టోబరు 4: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వందేళ్ల ప్రజాదరణ పొందిన 'చింతామణి' నాటకంపై నిషేధం విధించారని, వెంటనే దాన్ని ఎత్తివేయాలని టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పి.హనుమంతరావు చౌదరి డిమాండ్ చేశారు. శుక్రవారం 48వ వార్డు రోజావీధిలో మహిళా సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత అధ్యక్షతన జరిగిన నిరసన ప్రదర్శనలో పలువురు కళాకారులు పాల్గొన్నారు. హనుమంతరావు చౌదరి మాట్లాడుతూ చింతామణి నాటకం మంచి సందేశాత్మక నాటకమని, రాష్ట్రంలో వందలాది రంగస్థల కళాకారులకు ఉపాధిగా నిలిచే ఈ నాటక ప్రదర్శన ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఉపయోగపడేదని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరిగి చింతామణి నాటక ప్రదర్శనలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు కళాకారుల సేవా కేంద్రం అధ్యక్షుడు బైలుప్పల షఫీవుల్లా, ఏపీ సమాచార హక్కు పరిరక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎన్‌కే జయన్న, ఆంజనేయులు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

'సెలవుల్లో తరగతులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలి'

కర్నూలు(ఎడ్యుకేషన్), అక్టోబరు 4: దసరా సెలవుల్లో ప్రైవేటు కార్పొరేట్ కళాశాలలు తరగతులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లాలు ఆర్ఐవో గురువయ్యశెట్టికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఏపీ ఇంటర్ బోర్డు ఇచ్చిన ఆదేశాలతో దసరా సెలవులను ప్రకటించిందని, అయితే చాలా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల ఆదేశాలు లెక్క చేయకుండా స్పెషల్ క్లాసుల పేరుతో కాలేజీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఇటువంటి కళాశాలలపై బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి, జిల్లా కమిటీ సభ్యులు అంజి, ఆర్యన్ ఉన్నారు.

7 నుంచి ఇతర రాష్ట్రాల్లో కమిషనర్ పర్యటన

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 4: పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వివిధ ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ పనితీరును అధ్యయనం చేసేలా నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు అధ్యయనం పర్యటన చేపట్టనున్నారు. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకుల కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ పర్యటనలో భాగంగా ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు కమిషనర్ పూణే మున్సిపల్ కార్పొరేషన్, అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మహారాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, గుజరాత్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో పర్యటించనున్నారు. ఆయా ప్రాంతాల్లో ఆస్తి, పన్ను విధానాలు, ఇతర ఆర్థిక వనరులు, మంచి నీటి సరఫరా వ్యవస్థ, పన్నులు, వాణిజ్య అవసరాలకు సంబంధించి పన్నుల విధానం, తడి, పొడి చెత్త, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వంటి అంశాలను అధ్యయనం చేయనున్నారు. కమిషనర్‌తో పాటు ఆర్.సోమనారాయణ (విశాఖపట్నం అడిషనల్ కమిషనర్, శ్రీనాథ్ రెడ్డి (విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌చీఫ్ ఇంజనీర్), ఆర్.రామ్మోహన్ రెడ్డి (డీఎస్‌ఈ అనంతపురం పర్యటనకు వెళ్లనున్నారు)

క్యూబా దేశ అంతర్జాతీయ సంస్థలో రాయపాటికి గౌరవ సభ్యత్వం

కర్నూలు(కల్చరల్), అక్టోబరు 4: కర్నూలుకు చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు క్యూబా దేశానికి చెందిన అంతర్జాతీయ సంస్థలో గౌరవ సభ్యత్వం లభించింది. ఆ దేశానికి చెందిన ఫండెషప్పర్ అంతర్జాతీయ సంస్థ ప్రధాన కార్యాలయ జనరల్ డైరెక్టర్ జస్టిస్ చాప్లిన్ మేజర్ ఏలియో అల్బర్టో నీనేజ్‌నెవల్ శుక్రవారం అంతర్జాలం ద్వారా డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు ఆ సంస్థలో గౌరవ సభ్యుడిగా అవకాశం కల్పించిన అఫీషియల్ ఐడెంటిటీ కార్డును అంతర్జాలం ద్వారా పంపించారు. 2020 ఏడాది నుంచి ఆ సంస్థ అంతర్జాలం ద్వారా నిర్వహించే సదస్సుల్లో శ్రీనివాస్ పాల్గొనడంతో పాటూ జిల్లాలోనూ లయన్స్ క్లబ్, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ సభ్యత్వం ఇచ్చినట్లు వారు తెలియజేశారని రాయపాటి శ్రీనివాస్ చెప్పారు.

తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 4: తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రకాష్‌నగర్‌లో జరిగిన నూతన శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం విఫలమైందని విమర్శించారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి సి.మహేష్, నాయకులు కుమార్‌రాజా పాల్గొన్నారు.

- ఆటోను కాల్చిన దుండగులను శిక్షించాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు డిమాండ్ చేశారు. నగర పాలక పరిధిలోని 45వ వార్డు అజీముద్దీన్ నగర్‌లో గుర్తు తెలియని దుండగులు ఆటోకు నిప్పుపెంటడం దుర్మార్గమన్నారు.
- ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సీపీఎం నాయకుడు ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. 11వ వార్డు ఎర్రబురుజు శాఖ మహాసభలో ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలలో ఒక్క పెన్షన్ స్కీమ్ తప్ప మరొకటి అమలు కాలేదన్నారు.

ఆర్‌యూ అంతర్ కళాశాలల మహిళా క్రీడా పోటీలు ప్రారంభం

కర్నూలు(స్పోర్ట్స్), అక్టోబరు 4: రాయలసీమ యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళా క్రీడా పోటీలు శుక్రవారం శ్రీసాయి కృష్ణ డిగ్రీ కాలేజీలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఆర్‌కయూ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ ఎస్.వెంకటేశ్వర్లు, శ్రీసాయికృష్ణ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆర్‌యూ వీసీ మాట్లాడుతూ మహిళలు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని, ప్రస్తుత పరిస్థితుల్లో అమ్మాయిలకు క్రీడలు ఎంతగానో అవసరం ఉందని అన్నారు. మనోధైర్యాన్ని కూడా పెంచుతుందన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని సూచించారు. వివిధ కళాశాలల నుంచి 15 జట్లు కబడ్డీ, చెస్ క్రీడల్లో పాల్గొన్నాయని చెప్పారు. శ్రీసాయి కృష్ణ డిగ్రీ కళాశాల పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నార. కబడ్డీ పోటీల్లో శంకరాస్ డిగ్రీ కళాశాల నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ జట్టుపై 28-19తో, శ్రీసాయికృష్ణ డిగ్రీ కాలేజీ బసిరెడ్డి డిగ్రీ కాలేజీపై 45-14 స్కోరుతో శ్రీలక్ష్మి బీపీఈడీ కాలేజీ నంద్యాల ఎస్ఆర్‌కే డిగ్రీకాలేజీపై 29-14 స్కోరుతో, సెయింట్ జోసెఫ్ డిగ్రీ ఉమెన్స్ కాలేజీ కర్నూలు ఎమ్మిగనూరు ఎస్ఎంఎల్ జట్టుపై 23-12 స్కోరుతో గెలుపొందాయి. కార్యక్రమంలో ఆర్‌యూ అసిస్టెంట్ డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డా.శివకిషోర్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో అతిథులు

కుష్ఠు నిర్మూలనపై వైద్యులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యాధికారులు

కర్నూలు(హాస్పిటల్), అక్టోబరు 4: జాతీయ క్షయ ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా (ఎన్‌టీఈపీ) కుష్ఠు నిర్మూలనపై శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని పెథాలిటీ లెక్చరర్ గ్యాలరీలో వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ హాజరయ్యారు. జాతీయ కుష్ఠు కార్యక్రమంలో భాగంగా సంబంధిత యాప్‌లు పోర్టల్‌లో పొందు పర్చాల్సిన అంశాల గురించి అవగాహన కల్పించినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ శిక్షణ రెండు బ్యాచ్‌లో వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలకు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సత్యవతి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.నాగప్రసాద్, డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డా.మల్లికార్జునరెడ్డి, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

మానవసేవలో 'లైఫ్ రక్త బృందం'

కర్నూలు(హాస్పిటల్), అక్టోబరు 4: శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన బయమ్మ (75) అనారోగ్యంతో పది రోజుల క్రితం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. అచేతన స్థితిలో ఉన్న ఆ వృద్ధురాలిని చూసుకోవడానికి కూతురు ఒక్కరే ఉన్నారు. దీంతో సాయం కోసం బేతంచెర్ల లైఫ్ రక్త సహాయ బృందాన్ని ఆశ్రయించారు. పది రోజులుగా రోగికి బృందం సభ్యులు సేవలు అందించారు. అయితే బయమ్మ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మృతదేహాన్ని బేతంచెర్ల రోటరీ క్లబ్ అంబులెన్స్‌లో కదిరికి తీసుకెళ్లారు. అయితే పది రోజులుగా అండగా ఉండి సేవలు అందించిన సభ్యులకు బయమ్మ కూతరు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈగా హరినాథ్‌బాబు

కర్నూలు(రూరల్), అక్టోబరు 4: కర్నూలు ఆర్టీసీ రీజియన్ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్‌గా వి.హరినాథ్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కడప కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్‌లో పనిచేస్తున్న ఆయన బదిలీపై కర్నూలుకు వచ్చారు. అంతకుముందు కర్నూలు ఆర్ఎం శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయా డిపో మేనేజర్లు, ఆర్ఎం కార్యలయం సిబ్బంది నూతన సీఎంఈని అభినందనలు తెలిపారు.

'రజకులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి'

కర్నూలు(అర్బన్), అక్టోబరు 4: రాష్ట్రంలోని రజకులకు నామినేటెడ్ పదవుల్లో న్యాయం చేయాలని రాష్ట్ర రజక ఐక్య సేవా సమితి అధ్యక్షుడు వెంపెంట రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరావుతో కలిసి వినతి పత్రం ద్వారా కోరారు. ఆయన మాట్లాడుతూ రజకులకు నామినేటెడ్ పదవులు జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. లీగల్ సెల్ కార్యదర్శి చంద్రశేఖర్, నంద్యాల జిల్లా టీడీపీ కార్యదర్శి కేతురి మధు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

'రైతులకు మేలు చేకూరేలా పత్తిని కొనుగోలు చేయాలి'

కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 4: రైతులకు మేలు చేకూరేలా పత్తిని కొనుగోలు చేసి రైతులకు చెల్లించాల్సిన మొత్తం వెంటనే చెల్లించాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) వారిని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఏల్‌పీసీ (డిస్ట్రిక్ట్ లెవెల్ పర్చేస్ కమిటీ) సభ్యులతో జేసీ సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పత్తి పండించిన రైతుల వివరాలు వీఏఏ ద్వారా నమోదు చేయించాలని వ్యవసాయ శాఖ జేడీని ఆదేశించారు. పత్తి నాణ్యత గురించి రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా మార్కెటింగ్ అధికారిని, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి జిల్లా మార్కెటింగ్ అధికారి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సీసీఐ సెంటర్ ఇన్‌చార్జి అధికారులు, పత్తి వ్యాపారులు పాల్గొన్నారు.

ఎంపీడీవోను కలిసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఓర్వకల్లు, అక్టోబరు 4: ఓర్వకల్లు ఎంపీడీవోగా పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి సన్మానించారు. ఎంఈవో ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో సీఆర్‌పీలు ఎంపీడీవోను సన్మానించారు. టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు కలిశారు.

నేడు సంస్మరణ సభ

కర్నూలు(కల్చరల్), అక్టోబరు 4: కర్నూలుకు చెందిన రంగస్థల కళాకారుడు జీసీ సుబ్బారావు సంస్మరణ సభ శనివారం సాయంత్రం 6:30 గంటలకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసినట్లు కళా వాహినీ సాంస్కృతిక, సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం. మనోహర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళావాహిని సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనలు ఉంటాయని, శ్రీకృష్ణ రాయబారంలో (శ్రీకృష్ణ పడక సీను), గయోపాఖ్యానంలో (యుద్ధ సీను) ప్రదర్శిస్తారని తెలిపారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారం

ఓర్వకల్లు, అక్టోబరు 4: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత సహకారంతో ఉయ్యాలవాడ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కరించినట్లు విద్యుత్ శాఖ డీఈ శేషాద్రి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ విద్యుత్ సబ్ స్టేషన్‌లో రూ.15లక్షలతో నిర్మించిన కెపాసిటర్ బ్యాంకును ప్రారంభించారు. కార్యక్రమంలో హెడ్ ఇంజనీర్ సుబ్బన్న, ప్రొటెక్షన్ ఏడీ శారద, ఏఈ సునీల్‌బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన నాగేంద్ర

కర్నూలు(అర్బన్), అక్టోబరు 4: మంత్రి నారా లోకేశ్‌ను శుక్రవారం సాయంత్రం ఉండవల్లిలోని ఆయన నివాసంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో తీసుకెళ్లాలని మంత్రి లోకేశ్ సూచించినట్లు నాగేంద్ర తెలిపారు. అలాగే జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, అక్టోబరు 4: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలోని బి.క్యాంప్, ఓల్డ్‌టౌన్, మిలిటరీకాలనీ, కల్లూరు ఎస్టేట్ సెక్షన్ల లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉద యం 9గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు: కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 4: నగరంలో క్షేత్రస్థాయిలో చిన్నపాటి సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులకు సూచించారు. శుక్రవారం ఆనంద్ థియేటర్, మద్దూర్‌నగర్, గౌసియా కాంప్లెక్స్, లక్ష్మీనగర్, డైమండ్ కాంప్లెక్స్, గ్రీన్‌పార్కుల తదితర ప్రాంతాలలో అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. హంద్రీ నది ఇంకా శుభ్రపరచాలని, మట్టి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. పలు ప్రాంతాలలో మురుగు కాల్వలపై ఆక్రమణలు వెంటనే తొలగించాలన్నారు. మురుగు కాలువల ప్రవాహానికి ఆటంకాలు ఉన్న చోట్ల అవసరమైన నిర్మాణాలు చేపట్టాలన్నారు. రెయిలింగ్ సక్రమంగా ఉండాలని, రహదారులపై నీటి నిల్వలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేటర్ రమణమ్మ, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, ఎఈలు శేషసాయి, సత్యనారాయణ, డీఈ కృష్ణలత తదితరులు ఉన్నారు.



మద్దూర్ నగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

మళ్లీ మద్యం సిండికేట్..?



కర్నూలు(అర్బన్), అక్టోబరు 4: నూతన మద్యం పాలసీలో ప్రైవేట్ మద్యం దుకాణాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన బడా వ్యాపారులు దుకాణాలను దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. గత వైసీపీ ప్రభుత్వం అన్ని ప్రాంతాలలో ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి ఉద్యోగులను నియమించింది. ప్రస్తుత ప్రభుత్వం అన్ని కోణాల్లో అలోచించి ప్రైవేట్ వ్యక్తులకు దుకాణాలను అప్పగించి ప్రభుత్వ ఆదాయాన్ని పెరిగేలా చేస్తున్నది. ఈనెల 1 నుంచి 9 వరకు దరఖాస్తుల స్వీకరణ, 11న వేలం ప్రక్రియ, 12న దుకాణాల ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంది. దీంతో మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు ఆశావహులు రింగ్ అయ్యేందుకు కొత్త వ్యూహాలు రచిస్తున్నారు.

- ఉమ్మడి జిల్లాకు 204 మద్యం దుకాణాలు
- 9 వరకు దరఖాస్తుల స్వీకరణ
- మంత్రి టీజీ భరత్ పరోక్ష హెచ్చరికలు

కర్నూలు, నంద్యాల జిల్లాలకు 204 మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దుకాణాలకు ప్రైవేట్ వ్యక్తులు స్థలాలు చూపించి దుకాణాలు ఏర్పరుచుకోవాలి. 5 వేల నుంచి 10 వేల జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ. 55 లక్షలు, 50 వేల నుంచి లక్ష జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ. 65 లక్షలు ధరలు నిర్ణయించారు. దరఖాస్తుదారుడు ప్రతి ఒక్కరూ రెండు లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంది. ఒక వేళ వేలం పాటలో షాపు దక్కకుంటే రూ. రెండు లక్షలు ప్రభుత్వానికి ఆదాయంగా వెళ్తుంది.

పాత వారే చక్రం తిప్పే సిండికేట్లు

2014-19 వరక ప్రైవేట్ మద్యం దుకాణాలే నడిచాయి. ఆ సమయంలో జిల్లాలోని కొందరు దళారులు అప్పుడు చక్రం తిప్పారు. సిండికేట్లుగా ఏర్పడి దుకాణాలను దక్కించుకుని కోట్ల రూపాయలు అర్జించారన్న వాదనలు ఉన్నాయి. ఈ విధంగానే ఈ ఏడాది కూడా కొందరు సిండికేట్లుగా ఏర్పడి దుకాణాలకు దరఖాస్తులు చేస్తున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం అడ్డదారులు తొక్కేవారిపై ఉక్కుపాదం మోపుతామని ప్రచారం చేస్తున్నప్పటికీ పెద్దగా ఫలితం కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

కొత్త బ్రాండ్లపై ఆసక్తి

గత వైసీపీ ప్రభుత్వం కొన్ని నాసిరకం మద్యం బ్రాండ్లను విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడిందన్న విషయం అందరికి తెలిసిందే. కొత్తగా దుకాణాలు ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం వల్ల నాసిరకం బ్రాండ్లు ఉండవని ఎప్పటి నుంచో పేరు పొందిన బ్రాండ్లు అందుబాటులో ఉంటాయని ప్రభుత్వ పేర్కొంటున్న విషయం తెలిసిందే. ప్రతి బ్రాండ్ అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ధరలు కూడా గతంలో మాదిరిగా కాకుండా భారీగానే తగ్గించ వచ్చని వినియోగదారులు ఆసక్తిగాఎదురు చూస్తున్నారు.

సిండికేట్లకు పరోక్షంగా హెచ్చరించిన మంత్రి టీజీ భరత్

దేశంలో ఎక్కడా లేని విధంగా ఎక్సైజ్ పాలసీ తీసుకొచ్చామని, మద్యాన్ని ఎంఆర్‌పీ ధరలకే అమ్మేలా చర్యలు తీసుకుంటామని మంత్రి భరత్ అన్నారు. కర్నూల్లో ఎంఆర్‌పీ ధరల కంటే అధికంగా అమ్మాలనే ఆలోచనలో కొందరు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇలా చేస్తే ఊరుకొనేది లేదని అన్నారు. ధర పెంచి మద్యం అమ్మి అక్రమంగా సంపాదించాలని అనుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని, సిండికెట్లు అయ్యేవారిని ఇటీవల పరోక్షంగా హెచ్చరించారు..



బ్రహ్మచారిణిగా చౌడేశ్వరీమాత



నందవరంలో బ్రహ్మచారిణీ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న నందవరం చౌడేశ్వరీమాత

బనగానపల్లె, అక్టోబరు 4: బనగానపల్లె మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవరోజు శుక్రవారం నందవరం చౌడేశ్వరీ మాత బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ఈఓ కామేశ్వరమ్మ, మాజీ ఛైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదేవిధంగా బనగానపల్లె పట్టణంలోని కొండపేటలో వెలిసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారు వాసవీమాత అలంకరణలో దర్శనమిచ్చారు.

దొంగల అరెస్టు

సి.బెళగల్, అక్టోబరు 4: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం కొటారు మిట్ట దగ్గర తిరుగుతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ గూడూరు నగర పంచాయతీకి చెందిన కుక్కల రామాంజనేయులు, సి.బెళగల్ మండలంలోని మారందొడ్డికి చెందిన శ్రీనివాసులు, కోడుమూరు మండలానికి చెందిన పులకుర్తి వేణుగోపాల్ కలిసి సి.బెళగల్ మండలంలోని మారందొడ్డి, కంబందహాల్, తిమ్మనదొడ్డి, కొండాపురం, ఇనగండ్ల, గూడూరు టౌన్, పులకుర్తి గ్రామాల్లో ఇళ్లకు వేసిన తాళాలను పగలగొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. వీరి దగ్గర నుంచి 24 గ్రాముల బంగారం, 27 గ్రాముల వెండి నగలు, రూ.4.75 లక్షలు, బైకు, ఒక విద్యుత్ మోటార్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్ప, శ్రీనివాసులు, దస్తగిరి ఉన్నారు.

మహిళ హత్య కేసులో భర్త అరెస్టు

కొలిమిగుండ్ల, అక్టోబరు 4: మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో నిద్రపోతున్న భార్య లక్ష్మిని గురువారం తెల్లవారురుఝామున అతికిరాతకంగా గొడ్డలితో నరికి హత్య చేసిన భర్త బైనేని రామ్మోహన్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేశ్‌బాబు తెలిపారు. కేసు నమోదు చేసిన 24 గంటల్లోనే అంకిరెడ్డిపల్లె వద్ద నిందితుడు రామ్మోహన్‌ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. భార్య లక్ష్మిపై అనుమానంతోనే రామ్మోహన్ హత్యకు పాల్పడినట్లు సీఐ వెల్లడించారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

డీఎస్‌వోగా రాజా రఘువీరా బాధ్యతలు



కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 4: కలెక్టరేట్‌లో శుక్రవారం డీఎస్‌వోగా రాజారఘువీరా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం డీఎస్‌వో మాట్లాడుతూ ఆఫీసు సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఏఎస్‌వో నుంచి పదోన్నతి లభించడంతో డీఎస్‌వోగా పదవి చేపట్టారు. డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా శుక్రవారం బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. అనంతపురం జిల్లా డ్వామా పీడీగా నియమితులయ్యారు. మెప్మా పీడీగా పని చేస్తున్న నాగ శివలీల డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా నియమితులయ్యారు.

లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో
కర్నూలుకు మూడో స్థానం



డీజీపీ ద్వారా ప్రశంసా పత్రాలు అందుకుంటున్న ఎస్పీ, సీఐలు

కర్నూలు, అక్టోబరు 4: లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో కర్నూలు జిల్లా మూడో స్థానంలో నిలిచింది. గత నెల 14న జిల్లా వ్యాప్తంగా మెగా లోక్ అదాలత్ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 816 కేసులు పరిష్కరించి రాష్ట్రా స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో శుక్రవారం విజయవాడలో ఎస్పీ బిందుమాధవ్‌ను డీజీపీ ద్వారకా తిరుమల్‌రావు ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. అలాగే జిల్లాలో కర్నూలు సబ్ డివిజన్ 356 కేసులు పరిష్కరించి మొదటి స్థానంలో నిలిచింది. టూటౌన్ సీఐ నాగరాజురావు 50 కేసులు పరిష్కరించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. నాలుగో పట్టణ సీఐ మధుసూదన్‌రావు 42 కేసులు పరిష్కరించి జిల్లాలో రెండో స్థానంలో నిలిచారు. ఈ ఇద్దరు సీఐలను కూడా డీజీపీ ద్వారకా తిరుమల్ రావు ప్రత్యేక అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు.

టెట్‌కు 155 మంది గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), అక్టోబరు 4: ఉపాధ్యాయ అర్హత(టెట్)పరీక్షకు రెండో రోజు శుక్రవారం 155 మంది గైర్హాజరయ్యారు. ఉదయం, సాయంత్రం జరిగిన రెండు సెషన్లలో మొత్తం 1,268 మంది అభ్యర్థులకు గాను పరీక్షకు 1,113 మంది హాజరయ్యారు. కర్నూలు, హైదరాబాద్‌లోని 8 పరీక్ష కేంద్రాల్లో జరిగింది. ఇందులో కర్నూలులో 6 హైదరాబాద్‌లో 2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఉచిత ఇసుకను అమలు చేయాలి
కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 4: రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఇసుక విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలను ఏమాత్రం అమలు చేయడం లేదన్నారు. ఇసుకను కొనేందుకు వెళ్తే సినిమా కనిపిస్తోందన్నారు. రాత్రి మూడు గంటలకు లేచి బుకింగ్ కోసం నిలబడాల్సిన దౌర్భాగ్య స్థితి నెలకొందన్నారు. కార్మిక కుటుంబాలు అర్ధాకలితో జీవిస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇసుకపై ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజలందరికి అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటి సభ్యురాలు పి.నిర్మల, నగర కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు నారాయణ, టి.రాముడు తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతుల ఖాతాల్లోకి నగదు

కర్నూలు(అగ్రికల్చర్), అక్టోబరు 4: పీఎం కిసాన్ యోజన సమ్మాన్ పథకం కింద 18వ విడత రూ.2వేలు శనివారం రైతుల బ్యాంకు ఖాతాలకు జమ కానున్నట్లు కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. జిల్లాలోని 2,45,252 మంది రైతులకు రూ.49.05 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాలకు ప్రధాని జమ చేయనున్నట్లు వెల్లడించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ పెట్టుబడి సాయాన్ని 2019 నుంచి అందిస్తోంది. రైతులకు ఏటా మూడు విడతల్లో రూ.6 వేల చొప్పున నగదు సాయాన్ని అందిస్తున్నట్లు జేడీ తెలిపారు. ఇప్పటి దాకా 17 విడతల్లో రైతులకు పంట సాయం అందిస్తోంది. వివిధ కారణాల వల్ల అర్హులైన రైతులు ఈ పథకం కింద ఆర్థిక సాయాన్ని అందుకోలేక పోతున్నారు. ఈ పథకానికి అర్హత సాధించాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా పూర్తి చేయాల్సి ఉందని, పీఎం కిసాన్ పోర్టల్ ద్వారా ఓటీపీ ద్వారా ఈకేవైసీ పూర్తి చేయవచ్చని జేడీ తెలిపారు. సమీపంలోని సీఎస్‌ఈ కేంద్రాలకు వెళ్లి బయోమెట్రిక్ ద్వారా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ మొబైల్ ద్వారా ఫేస్ అథెంటికేషన్ ఆధారిత ద్వారా ఈకేవైసీ పూర్తి చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఈ పథకం కింద ఎంపికైన జాబితాలో పేరు ఉందో లేదో రైతులు పీఎం కిసాన్ అధికారిక పోర్టల్ Https://pmkisan.gov.in లో చెక్ చేసుకోవాలని తెలిపారు.

ఆర్‌యూలో అధికారిపై దాడి యత్నం?

- దుశ్చర్యకు పాల్పడిన బీఈడీ కళాశాలల యజమానులు

కర్నూలు(అర్బన్), అక్టోబరు 4: రాయలసీమ యూనివర్సిటీలో ఓ ఉన్నతాధికారి చాంబర్‌లో ప్రైవేటు బీఈడీ కళాశాలల యజమానులు గురువారం వర్సిటీకి చెందిన ఓ అధికారిని దుర్భాషలాడుతూ దాడికి యత్నించినట్లు సమాచారం. దీంతో ఆ అధికారి కన్నీటి పర్యంతమైనట్లు తెలిసింది. ఈ ఘటనతో వర్సిటీలోని అధికారులంతా ఒక్కసారిగా ఉలిక్కినట్లు తెలుస్తోంది. గత నెల 30, ఈనెల 1న ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రక్రియలో భాగంగా వర్సిటీ నిబంధనల మేరకు ప్రతి స్కూల్‌కు అబ్జర్వర్లను నియమించడంతో వివాదం మొదలైంది. ఇదే విషయపైన బీఈడీ కళాశాలల యజమానులు వర్సిటీ ఉన్నతాధికారి దృష్టికి తెచ్చారు. అయితే తన ఆదేశాలను ధిక్కరిస్తున్నారని ఆ ఉన్నతాధికారి బీఈడీ కళాశాలల యజమానులను అధికారిపైకి పురమాయించినట్లు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారి అండదండలతోనే బీఈడీ కళాశాలల యజమానులు గురువారం ఓ ప్రైవేటు హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేసుకున్నారని, పైగా మద్యం తాగి వచ్చి అధికారిపై బూతుపురాణానికి తెగబడ్డారని విద్యార్థులు చెబుతున్నారు. 2017లో అప్పటి అధికారిపై కూడా ఇదే విషయంలో కళాశాలల యజమానులు దాడికి పాల్పడ్డారని, ప్రస్తుతం అధికారిపై దాడికి యత్నించడం దుర్మార్గమని పలువురు మండిపడుతున్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన ఓ కళాశాల యజమానులు దుశ్చర్యతో అధికారి కన్నీటి పర్యంతమయ్యారని కొందరు ప్రొఫెసర్లు చెబుతున్నారు. ఈ ఘటన ఓ ఉన్నతాధికారి ఎదుటే ఆయన చాంబర్‌లోనే జరిగిందని విద్యార్థి నాయకులు చెబుతున్నారు. బాధిత అధికారిని వివరణ కోరగా కళాశాలల యజమానులు వచ్చిన మాట వాస్తవమేనని, తనపై దాడి జరగలేదని చెప్పడం గమనార్హం. అధికారిపైనే దాడికి యత్నిస్తే ఎవరికి చెప్పుకోవాలని, సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు కూడా సూత్రదారులుగా మారితే ఎలా? అని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఇలాగైతే విద్యార్థులకు ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇతర రాష్ట్రాల విద్యార్థుల ప్రయోజనాల కోసం బీఈడీ కళాశాలల యజమానులు ఇలా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని అంటున్నారు.

టీడీఆర్ బాండ్ల అక్రమాలపై విచారణ ఏదీ?

- సబ్ రిజిస్ట్రార్ విలువతో నివేదిక
- బాండ్లపై వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక సంస్థలో ట్రాన్సఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లు అక్రమాలపై సమగ్ర విచారణ జరిగేనా..? అన్న ప్రశ్నలు వెల్లువెత్తున్నాయి. 2019 జనవరి నుంచి 2024 జూన్ వరకు కర్నూలు నగర పాలక సంస్థ 135 బదిలీ చేయదగిన అభివృద్ధి హక్కులు (టీడీఆర్) జారీ చేసింది. అందులో గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2019 మార్చి 20న ఒక టీడీఆర్ జారీ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 134 టీడీఆర్ బాండ్లు జారీ చేయడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఈ బాండ్ల విలువ రూ.వంద కోట్లుపై ఉంటుందని అంటున్నారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ టీడీఆర్ బాండ్ల జారీ అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పత్రాలు జరిగిన అక్రమాలు.. ఏ స్థాయిలో అవినీతి అక్రమాలు జరిగాయి..? నిగ్గు తేల్చడమే కాకుండా టీడీఆర్ ప్రక్రియ క్రమబద్ధీకరణకు శ్రీకారం చుట్టారు. నగర పాలక సంస్థ జారీ చేసిన టీడీఆర్ బాండ్లపై సమగ్ర విచారణలో భాగంగా టీడీఆర్ జారీ చేసిన ఇంటి నెంబరు, సర్వే నంబరు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ హక్కుదారులు ఎవరు?, ఏ వ్యక్తి పేరిట జారీ చేశారు?, ఆ వ్యక్తి నిజమైన హక్కుదారుడేనా?, ఇలా పక్కా ఫార్మాట్ తయారు చేసి పూర్తి వివరాలతో సర్వే చేయాలంటూ రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. విచారణ చేయకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రిజిస్ట్రేషన్ విలువ (ఎస్ఆర్ఓ) తీసుకొని అదే నివేదికగా పంపించారు. అక్రమాలు కప్పిపుచ్చేందుకే ఎస్ఆర్ఓ విలువతో మాత్రమే నివేదిక పంపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం కర్నూలు కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో టీడీఆర్ బాండ్ల వివరాలు తీసుకున్నారు. ఈ విషయాన్ని కమిషనర్ రవీంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ప్రస్తుతం ఎస్ఆర్ఓ విలువతో కూడిన నివేదిక పంపామని, సమగ్ర విచారణ చేయిస్తామని తెలిపారు.



కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయం

బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 4: ఈ నెల 12న జరిగే దేవరగట్టు బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని దేవాలయ కమిటీ సభ్యులకు సూచిస్తూ ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం తరుపు నుంచి చేయాల్సిన ఏర్పాట్లను చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో దేవరగట్టు బన్నీ ఉత్సవ ఏర్పాట్లపై అధికారులు, దేవస్థాన కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మాల సహిత మల్లేశ్వరస్వామి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నెరణికి, నెరణికితాండ, కొత్తపేట, దేవరగట్టు గ్రామాల ప్రజలు బన్ని ఉత్సవాలను ఎలాంటి సమస్యలు రాకుండా పండుగల్లా జరరుపుకోవాలని సూచించారు. ఎవరూ గాయపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బన్నీ ఉత్సవ పర్యవేక్షణకు 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదోని సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. జేసీ బి.నవ్య మాట్లాడుతూ దేవరగట్టు బన్నీ ఉత్సవాల్లో భాగంగా సంప్రదాయం పేరుతో కొట్టుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాన్ని జరుపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చిరంజీవి, పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం
రూ.30 లక్షల చెక్కును కలెక్టర్‌కు అందజేసిన పొదుపు మహిళలు



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న పొదుపు మహిళలు

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 4: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన వరద బాధితు లను ఆదుకునేందుకు జిల్లాలోని పొదుపు మహిళలు ముందుకు వచ్చారు. మొత్తం రూ.50 లక్షలు జమచేయగా ఇటీవల శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా సీఎం సహాయ నిధికి రూ.20 లక్షల చెక్కును అందజేశారు. శుక్రవారం నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటీనరి హాల్‌లో పొదుపు మహిళలు రూ.30 లక్షల చెక్కును కలెక్టర్ రాజకుమారికి అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పొదుపు మహిళలు మానవతా దృక్పథంతో తమవంతు సాయం చేయడం అభినందనీయమని అన్నారు.

'కరువు మండలాల గుర్తింపు ప్రతిపాదనలు పంపించాలి'

కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 4: ఈ నెల 10వ తేదీ నాటికి జిల్లాలోని కరువు మండలాల ప్రతిపాదనలు పంపించాలని రెవెన్యూ (డిజాస్టర్ మేనేజ్మెంట్) స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కరువు మండలాలను 6 ఇంటికేటర్స్ ద్వారా ఎంపిక చేయాలన్నారు. జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు, ఎంత తక్కువ వర్షపాతం నమోదైన వివరాలను, వ్యవసాయపరంగా గతంలో ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు..? ఇప్పుడు ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారన్న విషయాన్ని, జిల్లాలో నీటి పారుదల శాఖ ద్వారా ఎంత విస్తీర్ణం భూమికి నీటిని అందిస్తున్నారనే విషయంపై నీటి పారుదల నివేదికను కూడా సమర్పించాలన్నారు. శాటిలైట్ ద్వారా నమోదైన పంట వివరాలను ఈ నెల 7వ తేదీలోపు పంపనున్నట్లు తెలిపారు. దాని ప్రకారం ఈ నెల 10లోపు కరువు మండలాల గుర్తింపు ప్రతిపాదనలను సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.రంజిత్ బాషా, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

టమోటా రైతు ఖుషీ

- రైతుకు కిలో రూ.40 నుంచి రూ.60లు
గతేడాది కిలో రూ.8లలోపే..

టమోటా రైతు ఖుషీ అయ్యాడు. పత్తికొండ మార్కెట్‌లో శుక్రవారం కేజీ రూ.60లు పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జత గంపలు (15 కేజీలు) రూ.1,400లు పలకడంతో తమకు ఆసరా లభించిందని అంటున్నారు.


శుక్రవారం పత్తికొండ మార్కెట్‌కు వచ్చిన టమోటా దిగుబడులు

పత్తికొండ, అక్టోబరు 4: టమోటా ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ వ్యవసాయమార్కెట్‌లో శుక్రవారం టమోటా కిలో రూ 60 పలికింది. గతనెలలో తెలుగురాష్ట్రాల్లో భారీ వర్షాలకు పంటలు నాశనం కావడంతోనే ఇలా ధరలు పెరిగినట్లు సమాచారం. రాయలసీమలో పండే టమోటాకు డిమాండ్ ఏర్పడింది. రాష్ట్రంలో మదనపల్లి, అనంతపురం తర్వాత భారీగా టమోటా ఎగుమతులుచేసే మార్కెట్‌గా పత్తికొండకు గుర్తింపు ఉంది. గత ఏడాది గిట్టుబాటు ధరలేక రైతులు పంటలు పారబోసి నిరసనలకు దిగారు. అయితే ఈఏడాది మంచి గిట్టుబాటు ధరలభిస్తుండడంతో ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

టమోటాతో ఆసరా..


ఎకరాలో సాగుచేశా, మొదటి సారి జతగంపలు (పదికిలోలు) రూ 650లకు అమ్ముడుపోగా, రెండోసారి రూ.1,100లకు పోయాయి. ఈరోజు (15కేజీలు) రూ. 1,400కు అమ్ముడు బోయాయి. ఈసారి టమోటా ధరలు ఆసరాగా నిలిచాయి.
- పూజిత, జెఎం తండా

ధైర్యంగా సాగుచేయవచ్చు


జతగంపలు(10కేజీలు) రూ.800లు చొప్పున అమ్ముడయ్యాయి. ఈరోజు ధరలు బాగున్నాయి. మంచి ధర పలికాయి. ఇలా ధరలు వస్తే ధైర్యంగా టమోటాను సాగుచేయగలుగుతాం.
- సురేంద్ర, పత్తికొండ.

రైతులందరికీ శనగ విత్తనాలు

మద్దికెర, అక్టోబరు 4: శనగ విత్తనాలు రైతులకు ఇబ్బందులు కలగకుండా అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి పంపిణీ చేస్తామని ఏవో రవి అన్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'విత్తనాల కోసం తిప్పలు' శీర్షికతన ప్రచురితమైన వార్తకు స్పందించారు. బురుజుల, పెరవలి, మద్దికెర వంటి ఆర్‌బీకే కేంద్రాల్లో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేశామని, సర్వర్ పని చేయకపోవడంతో కొంత ఆలస్యమైందని, 3,800 విత్తనాలు వచ్చాయని, అవస రమైతే మరిన్ని తెప్పిస్తామని తెలిపారు. రైతుల ఆందోళన చెందవద్దని ఏవో కోరారు.

నేడు ఆదోని మార్కెట్ యార్డ్‌లో క్రయవిక్రయాలు బంద్

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 4: తుఫాను ప్రభావం కారణంగా శనివారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలను నిలుపుదల చేస్తున్నట్లు మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. భారీ వర్షం వల్ల యార్డ్‌లో తూకాలు ఆలస్యమైందన్నారు. దీంతో లావాదేవీలను నిలుపుదల చేసినట్లు తెలిపారు. రైతులు వేరుశనగ, పత్తి, ఆముదం పొద్దుతిరుగుడు వంటి పంట ఉత్పత్తులను విక్రయానికి తీసుకురావద్దని కోరారు. యథావిధిగా సోమవారం నుంచి క్రయవిక్రయాలు జరుగుతాయని తెలిపారు.

విధుల్లోకి తీసుకోవడంపై హర్షం

ఆదోని టౌన్, అక్టోబరు 4: విశాఖ ఉక్కు కర్మాగారంలో తాత్కాలిక ఉద్యోగులను విధుల్లోకి తిరిగి తీసుకోవడం విజయమని కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు నాయకుడు సాయినాథ్ అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 4,200 మంది తాత్కాలిక ఉద్యోగులను తొలగించడంతో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల నిరసనకు దిగుతామనడంతో తిరిగి తీసుకున్నారని అన్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి మారుతిరావు, యువజన అధ్యక్షుడు దేవిశెట్టి వీరేష్, శ్రీనిత్ పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలి


కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయురాలు

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 4: వృత్తివిద్యానైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని పెద్ద హరివాణం జడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఇందిరా దేవి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పాఠశాలలో ఐటీ ఇంటర్న్‌షిప్‌ను ప్రారంభించారు. వృత్తివిద్య ఉపాధ్యాయుడు నవీన్ కుమార్, నాగేంద్ర, రామలక్ష్మి, విమల, సమాధానమ్మ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతిచెందిన వ్యక్తి

దేవనకొండ, అక్టోబరు 4: కరిడికొండ సమీపంలో గురువారం రాత్రి ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి (28) చికిత్స పొందుతూ మృతి చెందిన్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు. వివరాల మేరకు.. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని పోలీసులు కర్నూలుకు తరలించారు. కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడని వ్యక్తి వివరాలు తెలియకపోవడంతో కర్నూలు వైద్యశాలలో మృతదేహాన్ని ఉంచినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ పాలనలోనే గ్రామాభివృద్ధి

గోనెగండ్ల, అక్టోబరు 4: టీడీపీ పాలనలోనే గ్రామాభివృద్ధి సాధ్యమని సర్పంచ్ హైమావతి, టీడీపీ కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యా నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక మొట్టివీధిలో రూ.10లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజి పనులకు భూమి పూజ నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద సీసీరోడ్లు, డ్రైనేజికి రూ 2కోట్లు మంజూరయ్యాయన్నారు. మాజీ సర్పంచ్ రహ్మతుల్లా, వలి, బేతాళబడేసా, రామాంజినేయులు, మాజీ సర్పంచ్ రంగముని, భారతం రహంతుల్లా, రఫీక్, డాక్టర్ మిన్నల్ల, ఫక్రుద్దీన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, అక్టోబరు 4: దసరా రోజు దేవరగట్టు బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ కోరారు. శుక్రవారం ఉత్సవాల పోస్టరును విడుదల చేశారు.

రైతులందరికీ శనగ విత్తనాలు


శనగ విత్తనాలు అందజేస్తున్న తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, అక్టోబరు 4: రైతులందరికీ శనగ విత్తనాలు ఇస్తామని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతి అన్నారు. శుక్రవారం తుగ్గలి, రాతనలో విత్తనాలను అందించారు. తిరుపాల్‌నాయుడు, వెంకటస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.

'మార్కెట్‌లో రైతులపై దౌర్జన్యం అవాస్తవం'

పత్తికొండ, అక్టోబరు 4: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో రైతులపై దౌర్జన్యం అవాస్తవమని కార్యదర్శి కార్నలీస్ అన్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. టమోటా ధరలు పతనమైన సందర్భాలలో రైతులు ఆందోళన చేశారే తప్ప తప్ప వ్యాపారులవద్ద మోసపోలేదన్నారు. మార్కెట్ సిబ్బంది టమోటా కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. వ్యాపారులు డబ్బు ఆలస్యంగా ఇస్తున్నట్లు ఒక్క రైతు కూడా ఫిర్యాదు చేయలేదని తెలిపారు. ధరలు తక్కువ ఉంటే ఆ రోజే వ్యాపారులు డబ్బులు ఇస్తారని, ధర ఎక్కువగా ఉంటే మరుసటి రోజు ఇవ్వడం పరిపాటిగా వస్తుందని, విషయం రైతులకు తెలుసన్నారు. రైతులు ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని కార్యదర్శి అన్నారు.

జాబ్ మేళాలో 204మందికి ఉద్యోగాలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ప్రతినిధులు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 4: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 204మందికి ఉద్యోగాలు లభించినట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐఐఎఫ్ఎల్, టాటా క్యాపిటల్, అరబిందో ఫార్మా, ఎస్‌బీఐ లైఫ్ పాల్గొన్నాయి. 482మంది నిరుద్యోగులు హాజరయ్యారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయితేజ పాల్గొన్నారు.

దౌర్జన్యాలు చేస్తే పరిశ్రమలు ఎలా వస్తాయి?

ఆలూరు, అక్టోబరు 4: దౌర్జన్యాలు చేస్తే పరిశ్రమలు ఎలా వస్తాయని జనసేన ఇన్‌చార్జి వెంకప్ప ప్రశ్నించారు. శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. మొలగవల్లి, జోహరపురం గ్రామ సమీపంలో విండ్ పవర్ సబ్ స్టేషన్‌లపై ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అనుచరులు దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అభివృద్ధికి కృషి చెయ్యాలి తప్ప, అక్రమ వసూళ్లకు పాల్పడటం సరికాదన్నారు. నియోజకవర్గ పరిస్థితులను త్వరలో ఉపముఖ్యమంత్రి, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళతామన్నారు.

విండ్ పవర్‌పై దాడులు దారుణం

ఆస్పరి: విండ్ పవర్ కంపెనీ కార్యాలయాలపై దాడులు దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య విమర్శించారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ దాడులకు పాల్పడిన ఎమ్మెల్యే తమ్ముడు, అనుచరులను శిక్షించాలని డిమాండ్ చేశారు. గుడ్‌విల్ ఇవ్వలేదన్న ఉద్దేశ్యంతో దౌర్జన్యాలకు పాల్పడం మంచిది కాదని హితవు పలికారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, సీపీఐ మండల కార్యదర్శి విరూపాక్షి, ఆంజనేయ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పోలీసులు నిజాలు తెలుసుకుని అరెస్టు చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

దేవనకొండ, అక్టోబరు 4: పోలీసులు నిజాలు తెలుసుకొని అరెస్టు చేయాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. దేవనకొండ క్రాస్‌రోడ్డు వద్ద విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గాలి మరల కార్యాలయాల్లో తమ వారిని చేర్పించుకోవాలని అడిగేందుకు వెళ్లిన వారిపై పోలీసులు కేసులు పెట్టారని ఆరోపించారు. తమకు రౌడీయిజం చేయడం రాదన్నారు. 2014 నుంచి నియోజకవర్గంలో ఎవరు రౌడీల్లో ప్రజలకు తెలుసన్నారు. వెనకబడిన ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో, ఈవోఆర్డీ

తుగ్గలి, అక్టోబరు 4: ఎంపీడీవోగా కృష్ణమోహన్, ఈవోఆర్డీ శ్రీహరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సూపరింటెండెంట్ బాషా, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, రామబ్రహ్మం, కార్యదర్శులు గోపాల్, రామాంజనేయులు, రాజు నాయక్, శివ, రామకృష్ణ ఉన్నారు.

ప్రహ్లాదరాయల పల్లకోత్సవం


చెక్క పల్లకిలో ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, అక్టోబరు 4: పుణ్యక్షేత్రంలో ప్రహ్లాదరాయుల పల్లకోత్సవం శక్రవారం రమణీయంగా నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రహ్లాదరాయలకు పాదపూజ చేసి పల్లకిలో అధిష్ఠించి ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ నిర్వహించారు.

కేసు నమోదు

దేవనకొండ, అక్టోబరు 4: మాదాపురం వద్ద గ్రీన్ ఇన్‌ఫ్రా కంపెనీ గాలి మరల సబ్ స్టేషన్‌పై దాడి ఘటన నేపథ్యంలో సెక్యూరిటీ గార్డు తిరుపతయ్య ఫిర్యాదు మేరకు 24 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు. దేవనకొండ జెడ్పీటీసీ రామకృష్ణ (కిట్టు) తోపాటు మరో 23 మందిపై కేసు నమోదు చేశామన్నారు.

పీఆర్సీ ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు, అక్టోబరు 4: పీఆర్సీని ఏర్పాటు చేసి తక్షణమే ఐఆర్ చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, భానుమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీవర్స్‌కాలనీ జడ్పీ పాఠశాలలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ అధ్యక్షతన అధ్యయన తరగతులను నిర్వహించారు. కోణంకి అశోక్ కుమార్, పాతిరెడ్డి, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నందవరం, అక్టోబరు 4: మండలంలోని దర్మాపురం టోల్ గేటు దగ్గర కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. డీఎస్పీ ఉపేంద్రబాబు ఆదేశాల మేరకు సీఐ విక్రమసింహ, ఎస్ఐ వాహనాలను తనిఖీ చేస్తుండగా హాలహర్వి సమీపంలోని దర్మాపురం టోల్‌గేట్ వద్ద ఈడిగ వెంకటేష్ కర్ణాటక నుంచి కారులో 10 బాక్సుల మద్యం తెస్తుండగా అదుపులోకి తనుకున్నామని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'వివక్ష చూపిన వారిపై చర్యలు తీసుకోవాలి'

నందవరం, అక్టోబరు 4: మండలంలోని పూలచింతలో వివక్ష చూపిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి నాయకులు రాజు, ప్రకాష్, నవీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఈవో కార్యాలయం వద్ద డిప్యూటి ఈవో చిత్రపటాన్ని దహనం చేశారు. విచారణ పేరుతో అధికారులు కాలయాన చేస్తు కులం పేరుతో దూషించిన వారిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని, వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి


ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 4: పత్తికి క్వింటానికి రూ.10వేలు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మార్కెట్ యార్డ్ కార్యాలయం వద్ద రైతు సంఘం నాయకులు ఆందోళన చేశారు. ముందుగా పత్తి రైతులతో గిట్టుబాటు ధరపై మాట్లాడారు. పత్తికి మార్కెట్‌లో కనీస మద్దతు ధర లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారులు దళారులు పత్తి రైతులను నిండా ముంచుతున్నారని ఆరోపించారు. క్వింటాలుకు రూ.7,300లు కూడా ఇవ్వడం లేదన్నారు. సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. హనుమంతు, వెంకటేష్, అయ్యప్ప, భాష, తిక్కన, రహీం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

మంత్రాలయం, అక్టోబరు 4: మండలంలో అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీపీ గిరిజమ్మ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశ భవనంలో ఎంపీడీవో ఎం.శోభారాణి అధ్యక్షతన ఉపాధి హామీ పనులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 20 గ్రామ పంచాయతీల్లో గుర్తించిన ఉపాధి పనులను ప్రాధాన్య క్రమంలో చేయాలని, సర్పంచులు, ఎంపీటీసీలు దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ విశ్వనాథ రెడ్డి, ఏవో రాధ, ఈవోఆర్డీ ప్రభావతిదేవి, ఎంపీటీసీలు నరసమ్మ, వెంకటేశ్ శెట్టి, రామాంజనేయులు, ఈరన్న, సర్పంచులు ముకురన్న, ఆంజనేయులు, తెల్లబండ్ల బీమయ్య, లింగారెడ్డి, వీరారెడ్డి, ఉపాది ఏపీవో తిమ్మారెడ్డి, ఈసీ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్లు రఘువీర్ నాయుడు, బొజ్జప్ప, కృష్ణ, రాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యం


మార్లమాడికి సచివాలయంలో ఖాళీ కుర్చీలు

హాళగుంద, అక్టోబరు 4: హొళగుందలో గ్రామ సచివాలయ సిబ్బంది ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లిపోతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని మార్లమాడికి సచివాలయంలో ఆరు మంది ఉద్యోగులు ఉండగా, శనివారం ఒక వెల్ఫేర్ అసిస్టెంట్ తప్ప మిగతా సిబ్బంది అందుబాటులో లేరు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఎదురు చూస్తూ కూర్చుకున్నారు. కేవలం అటెండెన్స్ రిజిస్టర్‌లో హాజరైనట్లు సంతకాలు చేసి, స్వంత పనులపై వెళ్లిపోతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఓ ఉద్యోగి ఉదయం 10:40నిషాలకు సచివాలయం నుంచి బయటకు వెళ్లగా మూమెంట్ రిజిస్టర్‌లో మాత్రం 12:10నిమిషాలకు వెళ్లినట్లు నమోదు చేశారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యాదర్శి మహమ్మద్ షఫీని వివరణ కోరగా సిబ్బంది విధుల్లో ఉండాలని, విచారణ చేసి, చర్యలు తీసుకుంటానని అన్నారు.

టీడీపీ నాయకుడికి తిక్కారెడ్డి పరామర్శ


నాయకుడిని పరామర్శిస్తున్న తిక్కారెడ్డి

కోసిగి, అక్టోబరు 4: స్థానిక టీడీపీ నాయకుడు నాడిగేని రంగన్న అనారోగ్యంతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని తెలిపారు. రంగన్న ఆరోగ్యం గురించి వైద్యులను తిక్కారెడ్డి వివరాలు అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. తిక్కారెడ్డి వెంట టీడీపీ మంత్రాలయం నాయకులు అమర్నాథ్, నాడిగేని మాదేవ, నరసమ్మలు ఉన్నారు.

వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

పత్తికొండ టౌన్, అక్టోబరు 4: పట్టణంలో శుక్రవారం వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రంలో సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా వనరుల కేంద్రం అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు పంటలపై అవగాహన, యాజమాన్య పద్ధతులు, పంటలకు సోకే తెగుళ్లు, నివారణ అంశాలపై సిబ్బందికి అధికారులు అవగాహన కల్పించారు. ఏడీఏ మోహన్ విజయకుమార్, ఏవో వెంకట్రాముడు, వ్యవసాయాధికారి హేమలత, శాస్త్రవేత్తలు మౌనిక, చందన, రియాజ్‌బాషా, యోగా పాల్గొన్నారు.

పిడుగుపాటుతో మేకల మృతి

కౌతాళం, అక్టోబరు 4: మండలంలోని బదినేహాల్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం పిడుగుపడి 5మేకలు మృతి చెందాయి. గ్రామస్థులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన బందెసాబ్ మేకలను గ్రామ సమీపంలో మేపేందుకు అతని భార్య అమీనాబి తీసుకుపోగా మధ్యాహ్నం వర్షం కురిససింది. దీంతో చెట్టు కింద మేకలను నిలిపారు. ఉన్నట్టుండి పెద్ద శబ్దంతో పిడుగు మేకలపై పడటంతో అవి అక్కడిక్కడే మృతి చెందాయి. రూ.లక్ష నస్టపోయానని ప్రభుత్వం ఆదుకోవాలని మేకల యజమాని బందెసాబ్ కోరారు.

కాలువలు నిర్మించాలి

మద్దికెర, అక్టోబరు 4: హాస్టల్ నుంచి కాలువలు నిర్మించాలని హాస్టల్ వార్డెన్ రాజశేఖర్ రెడ్డి కోరారు. శుక్రవారం తహసీల్దార్ హుశేన్‌సాహెబ్, ఎంపీడీవో, సువర్ణలత, కార్యదర్శి శివకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. బాలుర వసతి గృహంలో 200 మంది విద్యార్థులున్నారని, 20 స్నానపు గదులు కట్టారన్నారు. అయితే కాలువలు లేకపోవటంతో మరుగు నీటితో ఇబ్బంది ఉందన్నారు. ప్రస్తుతం సెలవులు ఉండటంతో కాలువలు ఏర్పాటు చేసి మురుగు నీటిని తరలించాలన్నారు. స్పందించిన అధికారులు సమస్య పరిష్కరించే విదంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దినేష్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ గంగిరెడ్డి

బకాయిలు వసూలు చేయండి

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 4: పన్ను బకాయిలను వెంటనే వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కార్యాలయంలో వార్డు అడ్మిన్ సెక్రెటరీలు, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలో కొత్తగా గృహ నిర్మించుకున్న వారికి అసెస్‌మెంట్ నంబర్ ఇచ్చి పన్నులు వసూలు చేయాలన్నారు. బకాయి పడ్డ వారికి నోటీసులు జారీ చేయాలని అన్నారు. .అనంతరం నెహ్రూ నగర్‌లో చేస్తున్న డ్రైనేజీ రిపేరు పనులను పరిశీలించారు. డీఈఈ నీరజ, ఏఈ మదన్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుకను అందజేయాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 4: రాష్ట్రం ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుకను అందజేయాలని సీపీఐ పట్టణ నాయకులు రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ శేషఫణిని కలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇసుక రీచ్ లేకపోవడంతో ఎంతో మంది డౌడాపనిచేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇళ్లను నిర్మించుకోవాలనే లబ్ధిదారులు ఇసుకను కొనలేకపోతున్నారన్నారు. దూర ప్రాంతాల నుండి ఇసుకను తెచ్చుకునేందుకు లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నియోజకవర్గంలో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, లాలుసాబ్, మాణిక్యం, సాలేబ్, జైపాల్ పాల్గొన్నారు.

ముంచిన వర్షం

ఆదోని, ఎమ్మిగనూరు, గోనెగండ్లలో..
మార్కెట్‌లో కొట్టుకుపోయిన వేరుశనగ దిగుబడి, తడిచిన పత్తి



ఆదోని: ఎంఎం రోడ్డుపై వర్షపు నీరు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో..

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 4: పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఆలూరు మండలం నెరిణికి తండాకు చెందిన నాగరాజు నాయక్ ఎద్దులదొడ్డి గ్రామానికి చెందిన నడిమింటి రంగన్న మరి కొందరు రైతులకు చెందిన 160 బస్తాల వేరుశనగ దిగుబడులు కొట్టుకుపోయాయి. పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి హనుమంతు రైతులను ఆదుకోవాలని ఆందోళన చేశారు. కమీషన్ ఏజెంట్లతో మాట్లాడి పరిహారం ఇప్పిస్తామని కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. కాలువలు పొంగిపొర్లాయు.

ఎమ్మిగనూరు: పట్టణంలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మార్కెట్‌లో పంట ఉత్పత్తులు స్వల్పంగా తడిచాయి. టెండర్ పూర్తి అయి సరుకును బస్తాల్లోకి నింపే సమయంలో వర్షం ప్రారంభమైంది. రైతులు టార్పాలిన్లు కప్పటంతో కొంతమేర తడిసింది.

గోనెగండ్ల: మండల కేంద్రంతో పాటు గాజులదిన్నె, హెచ్ కైరవాడి, అలువాల, కులుమాల గ్రామాలలో శుక్రవారం సాయంత్రం జోరువర్షం కురిసింది. పత్తి, మిరప, కంది పొలాల్లో వర్షపు నీరు నిలవడంతో పత్తి, మిరప, మొక్కజొన్న, కంది, ఉల్లి, దెబ్బతింటాయని రైతులు వాపోయారు.


ఆదోని: వర్షపు నీటిలో కొట్టుకుపోతున్న వేరుశనగకాయలు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మద్దికెర, అక్టోబరు 4: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తాలుకా తెలుగు యువత నాయకుడు ఆకుల వేణుగోపాల్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ పత్తికొండ నుంచి మద్దికెరకు తారోడ్డు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తంచ ఏశారు. ఎమ్మెల్యే శ్యాంబాబు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. హంపా, ఎరవలి, పెరవలి గ్రామాల రైతులకు ఇబ్బందులు కలగకుండా హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీరు నింపాలని కోరారు. ఇళ్లు నిర్మించుకన్న వారికి బిల్లులు ఇవ్వాలని కోరారు. పారా విఠోబ, బాషా, బొల్లాపురం చంద్ర ఉన్నారు.